

వేడుకగా పంచెకట్టు పండగ

ముంచంగిపుట్టు మండలం సుజనకోట పంచాయతీలో పంచెకట్టు పండగను వేడుకగా నిర్వహించారు.

8లో



పాలన కొత్త పుంతలు

సచివాలయ వ్యవస్థతో పరిపాలన కొత్త పుంతలు తొక్కుతోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు.

8లో



ఇంటింటికీ సంక్షేమ పథకాలు

ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు.

8లో

న్యూస్‌రీల్

భగవాన్ బిర్సాముండా జయంతి వేడుకలు ప్రారంభం



భగవాన్ బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆదివాసీ జేఏసీ నేతలు

సాక్షి,పాడేరు: ఆదిమజాతుల స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సాముండా 149వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక వి.ఆర్.కల్యాణ మండపంలో బిర్సాముండా జయంతి, జాతీయ ఆదివాసీ సదస్సును జార్ఖండ్‌కు చెందిన ఆదివాసీ మహాసభ అధ్యక్షుడు బిజయ్ కుజుర్, ఆదివాసీ ఎక్తా పరిషత్ ప్రధాన కార్యదర్శి అశోక్‌బాయి చహందర్‌లు ప్రారంభించారు. భగవాన్ బిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గిరిజన ఆచార సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా పలువురు జాతీయ స్థాయి గిరిజన కళాకారులతో కళాప్రదర్శనలు నిర్వహించారు. బుధవారం చివరిరోజు సదస్సుకు ఆదివాసీ జేఏసీ నేతలు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల ప్రతినిధులు అరబింద్, విశ్వనాథ్ వాఖెడె, డాక్టర్ తమర్భ బాబురావునాయుడు, రొబ్బా నాగభూషణరాజు, రామారావుదొర, నెహ్రూ, ముఖి శేషాద్రి, వడియం శ్రీనివాసరావు, కంగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు డౌనూరు విద్యార్థి



ప్రకాష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు

కొయ్యూరు: మండలంలోని డౌనూరు ఆశ్రమ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న గెమ్మెలి ప్రకాష్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పోటీలో విజయం సాధించడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ప్రకాష్‌ను మంగళవారం పాఠశాల హెచ్‌ఎం ప్రభుదాస్, ఉపాధ్యాయులు జె.వి.గిరిబాబు, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. ఈ పోటీలు డిసెంబర్‌లో ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో జరుగుతాయి.

నేటి నుంచి గిరిజన స్వాభిమాన ఉత్సవాలు

కొమ్మాది(విశాఖ): గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విశాఖ రుషికొండలోని గిరిజన సాంస్కృతిక శిక్షణ మిషన్ భవన్‌లో బుధవారం నుంచి మూడవ జనజాతీయ గౌరవ దివస్–గిరిజన స్వాభిమాన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చినబాబు తెలిపారు. ఈ ఉత్సవాలు ఈ నెల 26వ తేదీ వరకు జరుగుతాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అందం..ఆదాయం

- పాడేరు డివిజన్‌లో విస్తారంగా వలిసెల సాగు
- భూమికి రంగేసినట్టు దర్శనం
- పర్యాటకులకు కనువిందు చేస్తున్న పూలు



హుకుంపేట మండలం కొట్నాపల్లి పంచాయతీలో వలిసెపూల తోటలు

సాక్షి,పాడేరు: భూమికి రంగేసినట్టు పసుపు పూలతో దర్శనమిచ్చే అందమైన వలిసెపూల పంట పర్యాటకులకు కనువిందు చేయడంతో పాటు గిరిజన రైతులకు మంచి ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. పాడేరు డివిజన్‌తో పాటు, సరిహద్దులోని విజయనగరం జిల్లా ఏజెన్సీలో మాత్రమే పూర్వం నుంచి నూనెగింజల పంట అయిన వలిసెలను సాగు చేస్తున్నారు. ఇక్కడ కొండపోడు, మెట్టభూములు ఈ పంటకు అనుకూలంగా ఉండడంతో గిరిజనులు ప్రతి ఏడాది వేస్తున్నారు. వలిసెల సాగు గిరిజన రైతులకు మంచి ఆదాయం ఇస్తోంది. ఎర్లీ రబీ పంటగా వ్యవసాయశాఖ గుర్తించింది.

మూడు వేల ఎకరాల్లో సాగు

పాడేరు డివిజన్‌లోని 11 మండలాల పరిధిలో మూడు వేల ఎకరాల్లో ఈఏడాది వలిసెల పంటను గిరిజన రైతులు సాగుచేసినట్టు చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం అధికారులు తెలిపారు. అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు, చింతపల్లి మండలాల్లో వలిసెల పంట ఎక్కువగా సాగవుతోంది. పాడేరు, జి.మాడుగుల, జీకే వీధి, కొయ్యూరు ప్రాంతాల్లోను కొంతమేర పంటను వేశారు. చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం వలిసెల పంటకు తగిన ప్రోత్సాహం అందిస్తోంది. మహారాష్ట్ర ఎఎస్ఎస్ 28, 30 రకాల విత్తనాలను వినియోగిస్తుండడంతో పంట ఆశాజనకంగా ఉంటోంది. ఎకరానికి రెండు నుంచి మూడు కిలోల విత్తనాలను సెప్టెంబర్ నెలలో పొలాల్లో రైతులు జల్లారు. ప్రస్తుతం వలిసె పూలు వికసించాయి. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడంతో పంట ఎదుగుదల బాగుంది. గత ఏడాది ఎకరం పంటకు 3 క్వింటాళ్ల వరకు వలిసె గింజల దిగుబడి వచ్చింది. పసుపుపూల వికాసంతో వలిసెపంట పర్యాటకులకు కనువిందు చేస్తోంది. ప్రతి ఏడాది అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు పర్యాటకులు వలిసెపూల అందాలను చూసేందుకు భారీగా తరలివస్తుంటారు. ఈఏడాది కూడా ఎక్కడికక్కడ వలిసెపంట దర్శనమిస్తుండడంతో ఈతోటలను సందర్శించి, ఫొటోలు తీసుకుంటూ సందడి చేస్తున్నారు. ఈఏడాది కూడా వలిసెపూల పంట గిరిజనులకు మంచి ఆదాయం ఇవ్వనుంది. కిలో రూ.100 ధరతో గత ఏడాది వలిసెగింజలను వ్యాపారులు కొనుగోలు చేశారు.

వచ్చే ఏడాది మరింత విస్తరిస్తాం



వలిసెల పంట సాగుకు ఏజెన్సీ అనుకూలంగా ఉంది. గతంలో పంటకు కలుపు మొక్కల బెడద ఉండేది. ప్రస్తుతం గిరిజన రైతులకు నాణ్యమైన విత్తనాలను పరిచయం చేయడంతో వాటి ద్వారా గత నాలుగేళ్ల నుంచి పంట ఆశాజనకంగా ఉంది. గిరిజన సబ్‌ప్లాన్‌లో గతంలో ఉచితంగా విత్తనాలు పంపిణీ చేయడంతో వాటిని గిరిజన రైతులు సంప్రదాయంగా వినియోగిస్తున్నారు. వచ్చే ఏడాది మరింతగా సాగును విస్తరించేందుకు మేలు జాతి విత్తనాలను పంపిణీ చేస్తాం

– ఎం. శ్రీనివాస్, శాస్త్రవేత్త, చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం

గవర్నర్‌కు ఆత్మీయ స్వాగతం



రైల్వే స్టేషన్ నుంచి బయటకు వస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

ఏయూక్యాంపస్ : అరకు మండలంలో రెండు రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం రాత్రి నగరానికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు ఆత్మీయ స్వాగతం లభించింది. రైలులో విశాఖకు వచ్చిన గవర్నర్‌కు వాల్తేర్ డివిజన్ డీఆర్‌ఎం సౌరబ్‌ప్రసాద్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోర్టు గెస్టు హౌస్ చేరుకున్న గవర్నర్‌ను విశాఖ కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఉదయం 7 గంటలకు పోర్టు గెస్టు హౌస్ నుంచి రోడ్డుమార్గంలో అరకు మండలం పద్మపురం పంచాయతీ పరిధిలోని యండపల్లివలస రైల్వే గెస్టు హౌస్‌కు వెళ్తారు. ముందుగా నిర్ణయించిన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

విస్తృత ఏర్పాట్లు

అరకులోయటౌన్: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం అరకులోయలో పర్యటించనున్నారు. ఈమేరకు స్థానిక క్రీడా పాఠశాల సమీపంలోని డిగ్రీ కళాశాల మైదానంలో విస్తృతంగా ఏర్పాట్లు చేశారు. పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ పర్యవేక్షించారు. సుమారు నాలుగు వేల మంది కూర్చోడానికి వీలుగా సభా ప్రాంగణం, వేదికను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు సంబంధించి, కాఫీ బోర్డు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్, సచివాలయ భవనాలు, రోడ్లు తదితర అభివృద్ధి పనులకు సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేయనున్నారు. గవర్నర్ పర్యటనకు వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని పీవో సూచించారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్



సభా ప్రాంగణం

టూరిజం కార్మికులతో చర్చలు సఫలం

సమ్మె విరమణ



చర్చల అనంతరం కార్మికులతో కలెక్టర్

అరకులోయటౌన్: డిమాండ్ల సాధనకు ఆందోళన చేస్తున్న టూరిజం కార్మికులతో కలెక్టర్, ప్రజాప్రతినిధులు జరిపిన చర్చలు ఫలించాయి. దీంతో వారు సమ్మెను విరమించారు. బుధవారం నుంచి విధులకు హాజరుకానున్నట్టు యూనియన్ ప్రతినిధులు తెలిపారు. కలెక్టర్ సుమిత్ కుమార్, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు మంగళవారం స్థానిక పున్నమి హరిత వేలి రిసార్ట్స్ గోష్టి సమావేశ మందిరం వద్ద టూరిజం కార్మికులతో చర్చలు జరిపారు. కార్మికుల జీతాల పెంపుదల, పదోన్నతికి సంబంధించిన అంశాలను వచ్చేనెల 31వ తేదీలోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మధ్యప్రదేశ్‌లో ఉన్న టూరిజం ఎండీ ఈనెల 17న వచ్చిన తరువాత హెచ్ఆర్ పాలసీ, గ్రాడ్యుటీ తదితర అన్ని సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్‌కు సంబంధించి కార్మికుల్లో 90 శాతం మంది గిరిజనులే ఉన్నారని, దీనిని ప్రభుత్వానికి ప్రతిపాదిస్తామని చెప్పారు. సీనియార్టీ ప్రకారం పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ చర్చల్లో టూరిజం ఏడీ శ్రీనివాస్, కార్మికుల నాయకులు గంగరాజు, బాబురావు, అంజలీరావు, పాల్గొన్నారు.

27న పుణ్యనదీ హారతి



వరాహ పుష్కరిణి

సింహాచలం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఈనెల 27న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వరాహ పుష్కరిణికి పుణ్యనదీ హారతి నిర్వహించనున్నట్టు ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. దేవస్థానం అనుబంధ దేవాలయమైన కొండదిగువ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి స్వామి ఉత్సవమూర్తులను ఆ రోజు సాయంత్రం 4.30 గంటలకు తిరువీధిగా వరాహ పుష్కరిణి వద్దకు తీసుకెళ్తామన్నారు. అక్కడ గట్టుపై ఉత్సవమూర్తులను వేంజేపచేసి సాయంత్రం 5.30 గంటల నుంచి పుణ్యనదీ హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. నక్షత్ర హారతి, కుంభ హారతి, ఆయుత దీపార్చనలు ఉంటాయన్నారు. అదే సమయంలో భక్తులు పుష్కరిణి గట్టుపై దీపాలు వెలిగిస్తారన్నారు. ప్రమిదలు, వత్తులు, నూనె దేవస్థానమే ఉచితంగా అందిస్తుందని తెలిపారు.

సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనకు చర్యలు

రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ జాయింట్ డైరెక్టర్ సరస్వతి



భవిత కేంద్రాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ సరస్వతి

గంగవరం: గిరిజన ప్రాంతంలో 2047 సంవత్సరం లోగా సికిల్ సెల్ ఎనీమియాను సంపూర్ణంగా నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ బి.సరస్వతి తెలిపారు. స్థానిక భవిత కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ఏజెన్సీలో గిరిజనులు అధికశాతం మంది సికిల్ సెల్ ఎనీమియా వ్యాధికి గురవుతున్నారని, దీనిని సంపూర్ణంగా నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. గిరిజనులందరికీ స్క్రీనింగ్ పూర్తి చేసి వైద్యం అందించేందుకు, 2047 సంవత్సరంలోగా ఈ వ్యాధిని నిర్మూలించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కొండరెడ్లకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం కమిషన్‌ను ఏర్పాటు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ గిరిజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. భవిత ఎడ్యుకేషనల్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.ప్రభుదాస్ ఆధ్వర్యంలో పాతగంగవరంలో నిర్వహిస్తున్న భవిత కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. స్థానిక భవిత కేంద్రంలో అమలు చేస్తున్న కార్యక్రమాలను, గిరిజన యువతకు అందిస్తున్న సేవా కార్యక్రమాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. గిరిజన ప్రాంతంలో స్వచ్ఛంద సేవా సంస్థల సేవలు అభినందనీయమని ఆమె అన్నారు.

భవిత ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రభుదాస్ ఆమెకు వివరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ జాన్‌రాజ్, సహాయ గిరిజన సంక్షేమ అధికారి కె.వి.ప్రసాద్, గంగవరం, టేకులవీధి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు, ఝాన్సీ హేన్సన్ పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవాలు



చెరువువీధి గ్రామానికి చెందిన బొండా గీత, ఆమె బిడ్డతో 108 సిబ్బంది



చామంతి, ఆమె బిడ్డతో 108 సిబ్బంది

పెదబయలు: ఒకే 108వాహనంలో వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు గర్భిణులు ప్రసవించారు. మండలంలోని అరడకోట పంచాయతీ చెరువువీధి గ్రామానికి చెందిన బొండా గీత అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. సిబ్బంది ఆమెను ముంచంగిపుట్టు ఆస్పత్రి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువై మార్గమధ్యంలో ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఆమెకు ఇది మొదటి కాన్పు. తల్లీబిడ్డలను ముంచంగిపుట్టు ఆస్పత్రిలో చేర్పించారు. వారు క్షేమంగా ఉన్నా రు. మంగళవారమే పెదబయలు మండలం బొండాపల్లి పంచాయతీ చంపాపుట్టు గ్రామానికి చెందిన వంతాల చామంతి అనే గర్భిణికి పురిటి నొప్పులు రావడంతో అదే 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా కుజభంగి జంక్షన్ సమీపంలో ప్రసవించింది. ఈఎన్‌టీ వి.రవి, సతీష్ కాన్పు చేసి, ముంచంగిపుట్టు ఏరియా ఆస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారు.

దారి కాసిన మృత్యువు

- రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుల మృతి
- మరొకరికి తీవ్రగాయాలు
- దుప్పులపాలెం సమీపంలో ఘటన



సంఘటన స్థలం వద్ద బాబూరావు మృతదేహం



మరణించిన నాలుగేళ్ల బాబుని పట్టుకుని ఉన్న రామయ్యమ్మ

అడ్డతీగల: అనారోగ్యంతో నాలుగేళ్ల కిందట భార్య మృతిచెందింది. అప్పటి నుంచి కొడుకే సర్వస్వంగా జీవిస్తున్నాడు... కుమారుడికి అనారోగ్యంగా ఉండడంతో వైద్యం చేయించేందుకు తీసుకొచ్చాడు. అంతలోనే వారిని మృత్యువు కబళించింది. అడ్డతీగల మండలం దుప్పులపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు మరణించారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల తెలిపిన వివరాలు... అడ్డతీగల మండలం వెదుళ్లకొండకి చెందిన మడకం బాబూరావు(28) భార్య నాలుగేళ్ల కిందట అనార్యోగంతో మృతిచెందినప్పటి నుంచి కుమారుడు ప్రదీప్ సాయి(4) లోకంగా జీవిస్తున్నాడు. కుమారుడికి అనారోగ్యంగా ఉండడంతో వైద్య కోసం వరసకు వదిన అయిన కుంజం రామయ్యమ్మను సాయంగా తీసుకొని మడకం బాబూరావు మోటార్ సైకిల్‌పై అడ్డతీగల తీసుకువచ్చాడు. వైద్యం అనంతరం వారపు సంతలో నిత్యావసరాలు కొనుగోలు చేసుకుని తిరిగి స్వగ్రామం వెదుళ్లకొండ బయలుదేరారు. అడ్డతీగల మండలం అనిగేరుకి చెందిన పిట్టా మంగిరెడ్డి మోటార్ సైకిల్‌పై అడ్డతీగల వైపు వస్తుండగా దుప్పులపాలెం సుద్ద గండి వద్ద అదుపుతప్పి రెండు మోటార్ సైకిళ్లు ఢీ కొన్నాయి. దీంతో తీవ్రంగా గాయపడిన బాబూరావు సంఘటనా స్థలంలోనే మరణించాడు. తీవ్రగాయాలపాలైన ప్రదీప్ సాయి, పిట్టా మంగిరెడ్డి, స్వల్పంగా గాయపడిన రామయ్యమ్మను 108 వాహనంలో అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చికిత్స పొందుతూ కోమాలోకి వెళ్లిన ప్రదీప్ సాయి ప్రాణాలు విడిచాడు. పిట్టా మంగిరెడ్డికి కంటి, తల భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నాడు. ఇతని పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. అడ్డతీగల ఎస్ఐ అప్పలరాజు సంఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అందుబాటులోకి ట్రీ రిసార్ట్



పద్మాపురం గార్డెన్ వద్ద నిర్మించిన రిసార్ట్



కాటేజీ ఎదురుగా నిర్మించిన పగోడాలు

- రిసార్ట్‌లో గదులు అద్దెకు తీసుకుంటే పలు పర్యాటక ప్రాంతాల్లో ప్రవేశం ఉచితం
- బస చేసేందుకు ఆసక్తి చూపుతున్న టూరిస్టులు

అరకులోయ టౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలోని పద్మాపురం ఉద్యానవనంలో పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్మించిన ట్రీ రిసార్ట్‌ను పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. చెట్ల మధ్యలో చెక్కలతో ప్రశాంత వాతావరణంలో నిర్మించిన రిసార్ట్ పర్యాటకులను ఆకట్టుకుంటోంది. ఇందులో బసచేసిన పర్యాట కులు మంచి అనుభూతి పొందుతున్నారు. ఆరు గదులు, వెయిటింగ్ హాల్ తోపాటు, గదుల్లో దిగిన వారు భోజనాలు చేసేందుకు వీలుగా రిసార్ట్ ఎదురుగా ఆరు పగోడాలు నిర్మించారు. ఈ రిసార్ట్‌లో విశాలమైన బెడ్ రూమ్, టాయిలెట్స్, బాల్కనీ ఏర్పాటు చేశారు. రిసార్ట్, పగోడాలు రాత్రి వేళల్లో విద్యుత్ కాంతుల నడుమ చూపరులను ఆకట్టుకుంటున్నాయని పర్యాటకులు తెలిపారు. ఒక్కో గదికి రూ.నాలుగు వేలు అద్దె తీసుకుంటున్నారు. ఈరిసార్ట్‌లో గది అద్దెకు తీసుకుంటే ముగ్గురికి ఉదయం టిఫిన్ కాంప్లిమెంట్‌గా అందిస్తారు. అంతే కాకుండా పద్మాపురం ఉద్యానవనం, గిరిజన మ్యూజియం, డుంబ్రిగుడ చాపరాయి వద్ద ప్రవేశం ఉచితం. ఈ రిసార్ట్‌లో బస చేసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు.



కాటేజీ లోపల బెడ్ రూమ్

అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాపై విచారణ

రాజవొమ్మంగి: మండలంలోని గడుటకుర్తి పంచాయతీ, గొబ్బిలమడుగు అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త, ఆయాపై ఫిర్యాదులు రావడంతో కొయ్యూరు సీడీపీవో విజయకుమారి ఆ కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించి, విచారణ జరిపారు. కార్యకర్త, ఆయా సక్రమంగా విధులకు హాజరుకావడం లేదని, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం ఇవ్వడం లేదని ఫుడ్ కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. దీంతో కమిషనర్ ఆదేశాల మేరకు సీడీపీవో విచారణ జరిపారు. స్టాక్ రూం పరిశీలించి, చిన్నారుల తల్లిదండ్రుల నుంచి వివరాలు సేకరించారు. సర్పంచ్ సవిరెల చంద్రుడు, రాజవొమ్మంగి సీడీపీవో దేవమణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు నాగజయలక్ష్మి, అరుణలత, అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త రత్నం ఈ విచారణకు హాజరయ్యారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని విచారణాధికారి విజయకుమారి తెలిపారు.

కేజీహెచ్ సేవలు భేష్


కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్, డాక్టర్ రాంబాబులను సన్మానిస్తున్న మాజీ మంత్రి

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్రతో పాటు ఒడిశాకు పెద్ద దిక్కుగా ఉన్న కేజీహెచ్‌ను ప్రభుత్వం పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ మంత్రి పి.బాలరాజు అన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.ఎ.రహ్మాన్‌తో కలిసి ఆయన మంగళవారం కేజీహెచ్‌ను సందర్శించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న పాడేరుకు చెందిన పలువురు రోగులను పరామర్శించారు. అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, డాక్టర్ రాంబాబులను దుశ్శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కేజీహెచ్‌లో కల్పించిన సదుపాయాల పట్ల బాలరాజు, డాక్టర్ రహ్మాన్ సంతృప్తి వ్యక్తం చేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కంటి రోగుల తరలింపునకు చర్యలు

హుకుంపేట: మండల వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపుల్లో కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి విశాఖలో శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించి శస్త్రచికిత్సలు చేస్తామని డిస్ట్రిక్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టరు విశ్వేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యాధికారి గాయత్రి ఆధ్వర్యంలో కంటి రోగులను పరీక్షించి అవసరమైతే శస్త్రచికిత్స కోసం విశాఖ పంపిస్తామన్నారు.

వేడుకగా పంచెకట్టు పండగ


స్నానానికి చిన్నారుల ముందు కలశాలతో నీరు


చిన్నారులకు పూజలు నిర్వహిస్తున్న సుజనకోట గ్రామస్తులు

- ఏటా దీపావళి తర్వాత నిర్వహణ
- దోషాల నివారణ, ఆయురారోగ్యాలు లభిస్తాయని నమ్మకం
- 8 నుంచి 10 ఏళ్లలోపు చిన్నారులతో పూజలు
- పూర్వీకుల ఆచారం పాటిస్తున్న సుజనకోట గిరిజనులు

ముంచంగిపుట్టు: దీపావళి అనగానే తారాజువ్వలు, చిచ్చుబుడ్డిలు, టపాసుల పేలుళ్లు గుర్తుకొస్తాయి. మన్యంలో ముంచంగిపుట్టు మండలం సుజనకోట పంచాయతీలో దీపావళి పండగను గిరిజన సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం భిన్నంగా జరుపుకుంటారు. దీపావళిని కాస్త పంచెకట్టు పండగగా జరుపుకుంటారు. ఈ పండగను దీపావళి అయిన వారంలో అనురాధ నక్షత్రం ఏరోజు వస్తుందో ఆ రోజు జరుపుతారు. గ్రామంలో ఎనిమిది నుంచి పదేళ్లలోపు చిన్నారులకు ఈ పంచెకట్టు ఆచారాన్ని నిర్వహిస్తారు. చిన్నారులను గ్రామంలో ఏర్పాటు చేసిన చావడి వద్దకు తీసుకొచ్చి మామిడి ఆకులతో తోరణాలు, కిరీటాలు తయారు చేసి అమ్మాయిలకు అలంకరణ చేస్తారు. చిన్నారులను క్రమంలో కూర్చోబెట్టి బిందెలతో నీటిని తీసుకొచ్చి పసుపు, చేదు ఆనపకాయను నీటిలో కలిపి పూలు, అక్షింతాలతో పూజలు చేస్తారు. పంచెకట్టు చిన్నారులను గునపాల మీద కూర్చోబెడతారు. ధూప దీపాలతో పూజలు చేసిన ఆ నీటితో చిన్నారులకు స్నానాలు చేయిస్తారు. అక్కడకు హాజరైన ప్రతి ఒక్కరిపై ఆ నీటిని జల్లుతారు. అనంతరం చిన్నారులకు తెల్లటి వస్త్రాలతో గిరిజన ఆచారం ప్రకారం వస్త్రాలు ధరిస్తారు. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు వారికి హారతి ఇచ్చి ఆశీర్వదిస్తారు. అనంతరం గ్రామ పెద్దలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్ల ఇళ్లకు మహిళలంతా వెళ్తారు. వారిచ్చిన డబ్బులు, గుమ్మడికాయలు, బియ్యం వంటి సరకులు తీసుకుని థింసా నృత్యాలు చేసి సందడిగా మహిళలు చుట్టం కార్యక్రమం జరుపుతారు.

పంచెకట్టు పండగ ఉద్దేశం

ఈ పంచె కట్టు కార్యక్రమం చేయడం ద్వారా 8 నుంచి 10 ఏళ్లలోపు చిన్నారులకు ఎటువంటి రోగాలు రావని, దోషాలుంటే తొలగిపోతాయని, నిత్యం సుఖసంతోషాలతో ఉంటారని నమ్మకంతో ఏటా పండగ నిర్వహిస్తారు. ఈ పండగకు హాజరయ్యే ప్రతి ఒక్కరి మీదా పూజలు చేసిన నీటిని జల్లుతారు. వారు సైతం నిత్యం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉంటారని స్థానిక గిరిజనుల నమ్మకం. మంగళవారం అనూరాధ నక్షత్రం రోజు కావడంతో సుజనకోట, కించాయిపుట్టు, మినుములపుట్టు గ్రామంలో గ్రామస్తులంతా భక్తి శ్రద్ధలతో పూర్వీకులు సూచించిన ఆచారాలను అనుసరిస్తూ పంచెకట్టు పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. చాలా గ్రామాల్లో ఈ పండగను మానేశారు. కొన్ని గ్రామాల్లో పూర్వీకుల ఆచార వ్యవహారాలు పాటిస్తూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్నారు.

రాబోయే తరానికి తెలియాలి..

మా తరం వరకు ఈ పండగను కొనసాగిస్తున్నాం. రాబోయే తరాల వారికి తెలియాలన్న ఉద్దేశంతో ఈ పండగను అందరి సమక్షంలోనే వివరిస్తూ జరుపుతున్నాం. ఈ పండగ చేయడం వల్ల పూర్వీకులకు మేము ఇచ్చే గౌరవంగా భావిస్తున్నాం.

– సమరెడ్డి శంకర్‌రావు,
సుజనకోట గ్రామం, ముంచంగిపుట్టు మండలం

పూర్వీకుల సూచనలు పాటిస్తున్నాం

మా తండ్రులు, తాతలు సూచించిన ప్రతి పండగలోనూ ఆచార నియమాలతో జరుపుకుంటున్నాం. దోషాలు పోవడం తోపాటు అంతా మంచి జరిగి సుఖ సంతోషాలతో ఉంటారని, ఎటువంటి రోగాలు దరి చేరవని పూర్వీకులు చెప్పారు. దానిని తూచ తప్పకుండా పాటిస్తూ కొనసాగిస్తాం.

– వెంగడ నీలకంఠం,
సుజనకోట గ్రామం, ముంచంగిపుట్టు మండలం

ఆదివాసీల ఉద్యోగాలపై గవర్నర్ స్పష్టత ఇవ్వాలి

– సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

అరకులోయ రూరల్: గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీలకు ఉద్యోగాలపై గవర్నర్ స్పష్టమైన వైఖరి ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకత్వంతోనే గవర్నర్ ఈ ప్రాంతంలో పర్యటిస్తున్నారన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభానికి రాష్ట్రపతి, గవర్నర్లను వాడుకోవడం కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు. వీరి ఉత్తర్వుల ద్వారా ఆదివాసీలకు వందశాతం రిజర్వేషన్ చట్టబద్ధత కల్పించవచ్చన్నారు. ఏకలవ్య పాఠశాలల్లో అన్ని రకాల ఉద్యోగాలు గిరిజనులతోనే భర్తీ చేయాలన్నారు. అనంతగిరి జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, నాయకులు రామారావు, పోతురాజు పాల్గొన్నారు.

ఆలయ ప్రాంగణంలో పాము


ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగాణంలోని పుట్ట నుంచి బయటకు వచ్చిన పాము

సాక్షి,పాడేరు: పట్టణంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో పుట్ట నుంచి పాము బుసలుకొడుతూ బయటకు వచ్చింది. నాగులచవితి సమీపిస్తుండడంతో ఆలయ ప్రాంగణంలోని పుట్టల వద్ద మంగళవారం సాయంత్రం మట్టి చదును చేస్తుండగా, ఓ రంధ్రం లోంచి నాగుపాము బయటకు వచ్చింది. సమీపంలోని భక్తులంతా పాముకు దండం పెడుతూ భక్తిప్రపత్తులు చాటుకున్నారు.

గ్రామ సచివాలయ వ్యవస్థతో పాలన కొత్త పుంతలు

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి


కోరాపల్లిలో సచివాలయ భవనాలను ప్రారంభిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో పరిపాలన కొత్త పుంతలు తొక్కుతుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. జి.మాడుగుల-2 (సాడేక్), కోరాపల్లిలో సచివాలయ భవనాలను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా వ్యవస్థలో వినూత్న మార్పులు తీసుకువచ్చారని, ఏదైతే ఎన్నికల సమయంలో చెప్పారో సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టిన వెంటనే వాటి సంస్కరణలు చేపట్టారన్నారు. అందులో భాగంగానే గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థలకు రూపకల్పన చేశారన్నారు. గ్రామ వ్యవస్థ పాలనలోనే వినూత్న మార్పులు వచ్చాయని, ప్రజలకు మరింత చేరువుగా అధికారులు పనిచేయటానికి అవకాశం ఏర్పడిందని వివరించారు. జిల్లా, మండల కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే ప్రజలు సమస్యలకు పరిష్కారం చూపించారన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షురాలు, జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, తహసీల్దారు కె. అప్పలస్వామి, సీఐ సత్యనారాయణ, పీఆర్ డీఈ నరేన్, వైస్ ఎంపీపీ కె. సత్యనారాయణ, ఎంపీటీసీలు అంగనయిని నానాజీ, మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు, సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు రామకృష్ణ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, మసాడి రాజులమ్మ మాలన్న, సీదరి కొండబాబు, పార్టీ మండలాధ్యక్షుడు ఎస్. మత్స్యకొండం నాయుడు, పాడేరు ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ మత్స్యరాస గాయత్రి, జేసీఎస్ మండల కన్వీనర్ ఎల్ కళ్యాణం పార్టీ జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు రామకృష్ణ, అంద్రయ్య, మండల నాయకులు పెదబాలన్న, గంగరాజు, చిట్టిబాబు, వెంకటేష్, వెంకటరమణ, వరహాల నాయుడు, కొండబాబు, సూర్యప్రకాష్‌నాయుడు, గంగన్నపడాల్ పాల్గొన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


పార్టీజెండాను ఆవిష్కరిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయ ఆవరణంలో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమానికి సంబంధించి సంక్షేమ, అభివృద్ధి క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమమే పరమావధిగా సుపరిపాలన అందిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపి, మరలా జగన్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించాలని ప్రజలను కోరారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలున్నా, తన దృష్టికి తీసుకు రావాలని కోరారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, ఎంపీడీవో ఉషారాణి, పార్టీ మండలాధ్యక్షుడు మల్లేశ్వరరావు, పార్టీ మహిళా విభాగం మండల అధ్యక్షురాలు శాంతి, సర్పంచ్ వెంకటరావు, పార్టీ ఉపాధ్యక్షులు జగ్గునాయుడు, గణపతి, వైస్ ఎంపీపీ లలిత, ఆనందరావు, మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు, సీనియర్ నాయకులు బాక సింహాచలం, గోపాల్, కృష్ణారావు, వినోద్, లింగు, బబిత పాల్గొన్నారు.

లేటరైట్ క్వారీల టెండర్లు నిలిపివేయాలి

మావోయిస్టు డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ పేరిట లేఖ


మావోయిస్టు లేఖ

జి.మాడుగుల: అనకాపల్లి జిల్లా నాతవరం మండలం సరుగుడులో లేటలైట్ తవ్వకాల కోసం వేస్తున్న టెండర్లను తక్షణమే నిలిపివేయాలని, అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగుల మండలం మధురమామిడిలో నల్లరాయి క్వారీల ఏర్పాటును వెంటనే ఆపేయాలని సీపీఐ మావోయిస్టు విశాఖ-అల్లూరి-అనకాపల్లి (వీఏఏ) డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులకు మంగళవారం ఈ ప్రకటన అందింది. ఆదివాసీ ప్రజల సంపదను దోచుకుపోతున్న మైనింగ్ మాఫియాను మన్యం నుంచి తరమండని, అడవిని, భూములను కాపాడుకోవడం కోసం మిలిటెంట్ పోరాటానికి సిద్ధం కావాలని అరుణ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. సరుగుడు గ్రామంలో లేటరైట్ తవ్వకాల లీజు కోసం టెండర్లు ఆహ్వానిస్తూ మైన్స్, జియాలజీ శాఖ ఈ నెల 2న ప్రకటన ఇచ్చిందని, నవంబర్ 16న టెండర్లకు ఆఖరు తేదీగా ప్రకటించిందని ఆ ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి సరుగుడులో గనులు తవ్వకాల కోసం 2019లోనే అదే గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ కొత్తా రాజేశ్వరి అనే బినామీ పేరుతో అన్ని రకాల దరఖాస్తులు, దొంగ సర్టిఫికెట్లు, తప్పుడు లైసెన్సుల వంటివన్నీ పూర్తి చేసేశారని అరుణ పేర్కొన్నారు. ఆదివాసీ ప్రజల హక్కులను తుంగలోకి తొక్కి ప్రజల సంపదను దోచుకోడానికి వేస్తున్న టెండర్లను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జి.మాడుగుల మండలంలో ఉరుము, మధురమామిడి, పరిసర ప్రాంతాల్లో హైవే నిర్మాణంలో భాగంగా ప్రజల వ్యవసాయ భూముల్లో అనుమతి లేకుండా అక్రమంగా నల్లరాయి క్వారీలను ఏర్పాటు చేస్తున్నారని ఆమె తెలిపారు. ఈ క్వారీ తక్షణమే నిలిపివేయాలని అరుణ ఆ ప్రకటనలో డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు


తీవ్ర గాయాలైన శైలజను ఆస్పత్రికి తరలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య


పెదబయలులో రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిన టెంకాని సాయి

చింతూరు: మండలంలోని చట్టి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంకు చెందిన దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. నాలుగు కుటుంబాలకు చెందిన ఎనిమిది మంది నాలుగు ద్విచక్ర వాహనాలపై సీతారాముల దర్శనం నిమిత్తం రావులపాలెం నుంచి భద్రాచలం బయలుదేరారు. ఈ క్రమంలో వారు చింతూరు మండలం చట్టి వద్ద మలుపు తిరుగుతున్న క్రమంలో వెంకటకృష్ణ, శైలజ దంపతులు నడుపుతున్న వాహనం అదుపుతప్పి కింద పడడంతో వారిద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారికి సపర్యలు అందించగా, అదే సమయంలో చింతూరు వస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పుల్లయ్య తన కారులో చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వారిని రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు డాక్టర్ పుల్లయ్య తెలిపారు.

మలుపు వద్ద అదుపు తప్పి బోల్తా పడిన బైక్ : ఇద్దరికి తీవ్ర గాయాలు

పెదబయలు: మండలంలోని సీతగుంట గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి 8.30 గంటల సమయంలో జెడ్పీ పాఠశాల రోడ్డు జంక్షన్ వద్ద బైక్ అదుపు తప్పి ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. విజయనగరం జిల్లా గంట్యాడ గ్రామానికి చెందిన టెంకాని సాయి, పి.విజయ్ పాడేరు నుంచి ముంచంగిపుట్టు వెళ్తున్నారు. ఈ క్రమంలో మలుపు వద్ద ఒక్క సారిగా బైక్ స్కిడ్ అయి అదుపు తప్పడంతో సాయికి కుడి కాలు విరిగింది. విజయ్‌కు ముఖం, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే పెదబయలు పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గంజాయి కేసులో తెలంగాణ యువకుల అరెస్టు

8 కేజీల గంజాయి, స్కూటీ స్వాధీనం


పనసలపాలెం సమీపంలో గంజాయితో పట్టుబడ్డ నిందితులతో ఎస్సై సంతోష్‌కుమార్

వై.రామవరం: గంజాయి కేసులో ఇద్దరు నిందితులను వై.రామవరం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.24 వేలు విలువ చేసే ఎనిమిది కేజీల గంజాయి, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ఎస్సై ఎం. సంతోష్‌కుమార్ తెలియజేసిన వివరాలివి... సరిహద్దు ప్రాంతం నుంచి గంజాయి అక్రమ రవాణా అవుతుందన్న సమాచారంతో సీఐ వై.రాంబాబు ఆదేశాల మేరకు మండలంలోని పనసలపాలెం సమీపంలో సోమవారం వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 8 కేజీలు గంజాయిను స్కూటీపై తరలిస్తుండగా ఇద్దరు నిందితులు పట్టుబడ్డారు. వీఆర్వో ధనలక్ష్మి సమక్షంలో పంచనామ నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తెలంగాణ రాష్ట్రం సూర్యాపేటకు చెందిన ఉప్పల గణేష్(22), నక్కా రాహుల్(22)లను అరెస్టు చేసి, మంగళవారం ఉదయం అడ్డతీగల కోర్టుకు హాజరుపరచారు. వీరిద్దరికీ న్యాయమూర్తి రిమాండు విధించారు. వీరు గతంలో మరో ఇద్దరితో కలసి గంజాయి అక్రమ రవాణా చేస్తూ తప్పించుకున్నారు. ఆ సమయంలో వీరిపై కేసు నమోదైంది.

ముగ్గురు మద్యం విక్రేతల అరెస్ట్

38 మద్యం సీసాలు స్వాధీనం


పట్టుకున్న మద్యం సీసాలతో అరెస్టయిన నిందితులు

గూడెంకొత్తవీధి: ముగ్గురు మద్యం విక్రేతలను సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ అప్పలసూరి అరెస్ట్ చేశారు. సంకాడ పంచాయతీ నిమ్మలపాలెంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు మంగళవారం ఎస్ఐ ఆధ్వర్యంలో పోలీసులు నిందితులు ఎస్ సరస్వతి, బి. కుమారస్వామి, డి. కృష్ణబాబులను అరెస్ట్ చేశారు. వారి నుంచి 38 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ మాట్లాడుతూ మద్యం అమ్ముతూ తరచూ పట్టుబడితే వారిపై పీడీ చట్టాన్ని ఉపయోగిస్తామని హెచ్చరించారు.

పొడ పాములు హతం



గంగవరం: స్థానిక శాఖా గ్రంథాలయం వెనుక వైపు పెంకిటిల్లులో రెండు పొడ పాములను స్థానికులు హతమార్చారు. సోమవారం అర్ధరాత్రి సమయంలో బుసలు కొట్టిన శబ్దం రావడంతో ఇంటి యజమాని భయాందోళనకు గురై కేకలు వేయడంతో స్థానికులు వచ్చి చంపేశారు. కొద్దిసేపటికి మరో పాము ఇంట్లో శబ్దం చేయడంతో భయాందోళనతో దానిని హత మార్చారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు


ప్రమాదానికి గురైన బస్

హుకుంపేట: అరకు-పాడేరు ప్రధాన రహదారి కొట్నాపల్లి సమీపంలో ఆర్టీసీ బస్సుకు మంగళవారం పెను ప్రమాదం తప్పింది. మండలంలోని ఉప్ప నుంచి పాడేరు వస్తున్న ఆర్టీసీ బస్సు కొట్నాపల్లి గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి రోడ్డు పక్కకు ఒరిగింది. అక్కడ నూతనంగా నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల్లో భాగంగా రోడ్డు పక్కన మట్టిలోకి బస్సు చక్రాలు దిగి పక్కకు ఒరగడంతో ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. దాంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రదేశంలో సమీపంలో విద్యుత్ స్తంభానికి తాకకుండా డ్రైవర్ చాకచక్యంగా నిలుపుదల చేశారు. లేదంటే ప్రాణాలతో బయట పడేవారం కాదని ప్రయాణికులు తెలిపారు.